ప్రజాశక్తి

మంగళవారం 25 ఫిబ్రవరి 2025

5

విజయనగరం

రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో రబీ సీజన్‌లో అపరాల పంటల బీమా విషయంలో రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు అధికారులను కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను కలిసి వినతినిచ్చారు. ప్రభుత్వం సాంకేతిక సమస్యలు సృష్టించి బీమా పరిహారం ఎగ్గొట్టేందుక బీమా కంపెనీలు చేస్తున్న కుట్రలను పరిశీలించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లోకవరపు ఆదినారాయణమూర్తి, పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంప కృష్ణమూర్తి, నాయకులు టి. పైడినాయుడులు పాల్గొన్నారు.

ఔను..! ఆ కుటుంబం ప్రజాసేవకు అంకితం..!! ఓవైపు వృత్తికి న్యాయం చేస్తూనే... మరోవైపు సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు పరితపించే మనస్తత్వం వారిది. బహుసా అందుకేనేమో ఆమెతోపాటు తమ్ముడు కూడా ఉపాధ్యాయ ఉద్యమాల్లో చెరగని ముద్రవేసుకున్నారు. చెల్లి సామాజిక కార్యకర్తగా ఉత్తరాంధ్రలో సుపరిచితులు. అన్న ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగి అయినప్పటికీ ప్రగతి శీల శక్తులకు చేతనైన సాయం చేస్తున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం వెలకట్టలేనిది. ఇదే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో నిలిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కుటుంబ నేపథ్యం. ఉపాధ్యాయ కుటుంబంతో పెనవేసుకుపోయిన బంధం వీరిది.

ఆ కుటుంబం ప్రజాసేవకు అంకితం

అనునిత్యం పోరుబాట

- విద్యార్థి దశ నుంచే విజయగౌరి ఉద్యమ బాట
- సోదరుడు శేషగిరి ఉపాధ్యాయ ఉద్యమ నేతగా సుపరిచితులు
- చెల్లెలు రమాదేవి సామాజిక కార్యకర్త
- జెవివి నేతగా భర్త సత్యంనాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయగౌరి స్వస్థలం బొబ్బిలి మండలం రాజుపేట. ఉపాధ్యాయునిగా పనిచేసిన కోరెడ్ల సంజీవినాయుడు, సూర్యకాంతమ్మలకు విజయగౌరి రెండో సంతానం. అన్నయ్య తిరుపతి నాయుడు, చెల్లెలు రమాదేవి ఉన్నారు. తమ్ముడు కీర్తిశేషులు శేషగిరి (గిరిబాబు) ఉపాధ్యాయ ఉద్యమ నేతగా రాష్ట్రంలోనూ, ముఖ్యంగా ఉత్తరాంధ్రలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2021లో శేషగిరి మాస్టారును కరోనా కబలించడంతో ఉపాధ్యాయలోకం విస్తుపోయింది. విజయగౌరి భర్త సత్యంనాయుడు కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘకాలంగా జనవిజ్ఞాన వేదికలో పని చేస్తున్నారు. ఇక విజయగౌరి కుటుంబ విషయాలకు వస్తే... తండ్రి వృత్తిరీత్యా బొబ్బిలి మండలం నారసింహునిపేటలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. దీంతో ఆ గ్రామంలోనే గౌరితోపాటు అన్న, చెల్లి, తమ్ముడు కూడా ఏడో తరగతి వరకు చదువుకున్నారు. తాతగారి ఊరు కూడా అదే కావడంతో పాతికేళ్లు అదే గ్రామంతో ప్రత్యేక అనుబంధం ఉంది.

విజయగౌరి బొబ్బిలి సిబిఎం గర్ల్స్ స్కూలులో 8వ తరగతి చదువుతుండగానే అప్పటికే ఎస్ఎఫ్ఐ నాయకురాలిగా పనిచేస్తున్న భవానితో పరిచయం ఏర్పడింది. అప్పటికే అన్న తిరుపతి నాయుడు కూడా ఎస్ఎఫ్ఐలో కార్యకర్తగా ఉన్నారు. ఈనేపథ్యంలో 10వ తరగతిలోనే ఎస్ఎఫ్ఐ సభ్యత్వం అడిగి మరీ తీసుకున్నారు. ఇదే ఆమె ఉద్యమ భాటకు, సామాజిక సేవకు కీలక మలుపుగా మారింది. సోదరుడు, విజయగౌరి చేపట్టిన కార్యక్రమాలు శేషగిరి ఉద్యమ ప్రస్థానానికి ప్రేరణ కలిగించాయి. మరోవైపు రమాప్రభ కూడా చిన్ననాటి నుంచి సామాజిక కార్యక్రమాలపై ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా చిల్డ్రన్స్ క్లబ్ నడుపుతూ చిన్నారుల్లో వున్న నైపుణ్యాన్ని వెలికి తీయడంతోపాటు ఆటపాటల్లో మేటిగా తయారుచేసే బాధ్యతల్లో ఉన్నారు. ఇలా విజయగౌరిలో చదువు - అధ్యయనం, ఉపాధ్యాయ వృత్తి - పోరాటం జీవితంగా మారాయి.

1996 నుంచి బొబ్బిలి ప్రాంతంలో యుటిఎఫ్ విస్తరణకు విజయగౌరి కృషి చేశారు. యుటిఎఫ్ బొబ్బిలి మండల తొలి కార్యదర్శిగా ఎన్నికైన ఆమె, అనంతరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సహాధ్యక్షులుగా, ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ యుటిఎఫ్ ఉద్యమాల్లోనూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేయడంలోనూ కీలకపాత్ర పాత్ర పోషించారు.

ఉపాధ్యాయ వృతిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కోరెడ్ల విజయగౌరి కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగాను, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలలపాటు 20మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్యమాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

కుటుంబ సభ్యులతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా చురుకైన పాత్రపోషిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

యుటిఎఫ్ నాయకురాలిగా ఉపాధ్యాయ సమస్యలపైనా, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు జరిగిన ఉద్యమాల్లో విజయగౌరి పాల్గొన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని, పాఠశాలలను విలీనం చేసి ఉపాధ్యాయ పోస్టులకు, విద్యార్థులకు నష్టం కలిగించే 117జీవో రద్దు కోసం చేపట్టిన పోరాటాల్లో కీలకపాత్ర పోషించారు. కెజిబివి, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. ఈనేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న విజయగౌరి గెలుపు ద్వారా తమ సమస్యలపై శాసనమండలిలో గళం వినిపిస్తారని వారంతా విశ్వసిస్తున్నారు.

సూక్ష్మ పరిశీలకులే కీలకం

జిల్లా ఎన్నికల అధికారి బిఆర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు విధులు ఎంతో కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పిఒలు, ఎపిఒలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ నిర్వహించారు. అనంతరం ఎన్నికల సామగ్రిని అందజేశారు. సూక్ష్మ పరిశీలకులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులను ప్రతిఒక్కరూ ఎంతో అప్రమత్తంగా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సూక్ష్మ పరిశీలకులు తాము పరిశీలించిన అంశాలను యథాతథంగా నివేదిక రూపంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జరుగుతుందా? లేదా అని గమనించడమే వీరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికలను సిసి కెమేరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, వీడియో రికార్డింగ్ కూడా చేస్తామని చెప్పారు. సాధారణ ఎన్నికలకు భిన్నంగా బ్యాలెట్ పేపర్ ద్వారా, ప్రాధాన్యతా ఓటు పద్ధతిలో ఈ ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతాయని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ భాస్కర్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్‌బాయ్ అదనంగా వసూలు చేస్తే డీలర్‌పై చర్యలు

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేసేటప్పుడు గ్యాస్‌బాయ్ అదనంగా డబ్బులు తీసుకుంటే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. సోమవారం ఆయన ఛాంబర్లో గ్యాస్ డీలర్లతో జెసి సమావేశం ఏర్పాటు చేశారు. దీపం పథకం కింద అందిస్తున్న మొదటి విడత ఉచిత సిలిండర్ల కార్యక్రమం మార్చి వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 4.11 లక్షల మంది లబ్ధి పొందారని, ఈ మార్చిలోగా మిగిలిన వారికీ కూడా అందిస్తామని చెప్పారు. ఐవిఆర్ఎస్ సర్వేలో లబ్ధిదారులతో మాట్లాడి, సబ్సిడీ పడిందా?, 24 గంటల్లోపు జమైందా?, గ్యాస్ బాయ్ అదనపు డబ్బు అడుగుతున్నారా? వంటి ప్రశ్నలను అడుగుతున్నట్లు చెప్పారు. ఎక్కడైనా బాయ్ అదనంగా డబ్బులు అడిగాడని తెలిస్తే సంబంధిత డీలర్‌పై లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లే గ్యాస్ సరఫరా చేసే బాయ్స్‌కు గట్టిగా చెప్పాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎస్ఒ మధుసూదన్‌రావు, లీగల్ మెట్రాలజి అసిస్టెంట్ కంట్రోలర్ రంగారెడ్డి, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసి కంపెనీ డీలర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం

ఓ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ

జిల్లా అభివృద్ధికి చేసిందేమిటో చెప్పాలి? : వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఒక లిమిటెడ్ కంపెనీలా ఉందని, జిల్లా అభివృద్ధికి ఏడాది కాలంలో ఒక్క పైసా కూడా ఖర్చు. చేయలేదని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. సోమవారం తమ క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ సంస్థను ప్రైవేటీకరణ చేసే విధంగా అడుగులు వేస్తుందని అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విజయనగరం జిల్లాకు చెందిన మంత్రి , ఎమ్మెల్యేలంతా కలిసి ఎంతవరకు లబ్ది చేకూరే విధంగా చేస్తారో చూస్తామని అన్నారు . జిల్లాకు రావలసిన నిధులన్నీ రాబట్టే విధంగా పోరాటం చేయాలని సూచించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రాబోయే వేసవిలో మంచినీటి కొరత రాకుండా చూడాలని రామతీర్థసాగర్‌ను పూర్తి చేయాలన్నారు. ఏ ఒక్క ప్రజా ప్రతినిధి కూడా కష్టాల్లో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని , ముఖ్యమంత్రి ఒకలా స్పందిస్తారని అదే విషయం జిల్లా మంత్రి వేరే విధంగా స్పందిస్తారని విమర్శించారు. జిల్లాలో అభివద్ధి పూర్తిగా కుంటిపడి పోయిందన్నారు. సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేశారని అన్నారు. ప్రజలకు రావాల్సిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని తెలిపారవు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె.వి సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడు బాబు, గంట్యాడ జెడ్‌పిటిసి సభ్యులు వర్రి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే నా అజెండా

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

భోగాపురం ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి-భోగాపురం, వేపాడ, జామి

ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే తన అజెండా అని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తెలిపారు. సోమవారం భోగాపురం, జామి, వేపాడ మండలాల్లో ఆమె విస్తృతంగా ప్రచారం చేపట్టారు. భోగాపురం ఉన్నత పాఠశాల, ఎపి మోడల్ స్కూల్, రావాడ, పోలిపల్లి ఉన్నత పాఠశాలల్లోను, జామి జెడ్‌పి ఉన్నత పాఠశాల, వేపాడ మండలంలో కెజిబివి, ఆదర్శ పాఠశాల, గురుకులంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బొద్దాం, సోంపురం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుని, కచ్చితంగా వాటి పరిష్కారానికి తనవంతు సాయశక్తులా కృషి చేస్తానని హామీఇచ్చారు.

అవకాశమిస్తే ఉపాధ్యాయుల గొంతునవుతా

ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే విధాన మండలిలో ఉపాధ్యాయుల గొంతును వినిపిస్తానని విజయగౌరి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై గత కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలను దగ్గర నుంచి చూసిన తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతానని అన్నారు. చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీయని వారికి ఓటు వేసి గెలిపించినా ఉపయోగం లేదన్నారు. గతంలో పనిచేసిన వారంతా సమస్యను గాలికి వదిలేసి ప్రభుత్వాలకు అనుగుణంగా ఉండడంతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల గొంతు రాష్ట్రంలో వినిపించ లేదని అన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల వల్ల విద్యా శాఖలో అపారమైన నష్టం జరిగిందని అన్నారు.

మొదటిసారిగా పెద్దల సభకు ఒక మహిళగా ప్రాతినిధ్యం చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ ఓటర్లంతా విజయగౌరికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు, వేపాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిన్నింటి వెంకటరమణ, ఇమంది జగదీశ్వరరావు, కోశాధికారి పి.చిరంజీవి, సీనియర్ నాయకులు ఎస్‌విఎన్ స్వామి, డి.జగదీష్, ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్, భోగాపురం యుటిఎఫ్ నాయకులు పి.చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వైకుంఠరావు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్, గుడ్లు

నిర్భయంగా తినొచ్చు

విజయనగరం : జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాధి లేదని, ఆ లక్షణాలు గల వ్యాధిగ్రస్తులూ లేరని పశు వైద్యాధికారులు ధ్రువీకరించారని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అందువల్ల ప్రజలు చికెన్, కోడిగుడ్లను నిర్భయంగా తినొచ్చని సూచించారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి, చికెన్, కోడిగుడ్ల వినియోగంపై తమ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. ఆయా శాఖలు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూపై ప్రజలు ఎటువంటి అపోహలూ పెట్టుకోవద్దని సూచించారు. పాఠశాలలు, కెజిబివిలు, హాస్టళ్లు, సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు, తల్లులకు గుడ్లు సరఫరా చేయడమే కాకుండా, వాటిని తీసుకొనే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిని చైతన్య పరిచి, గుడ్లను వినియోగించే విధంగా చూడాలని చెప్పారు. గుడ్లను కనీసం 70 డిగ్రీల వేడి వద్ద ఉడికిస్తే సూక్ష్మజీవులు నశించిపోతాయని తెలిపారు. విద్యార్థులకు గుడ్లను సరఫరా చేస్తున్న పౌల్ట్రీ ఫారాలను తనిఖీ చేసి, పరిశుభ్రత పాటించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఒ మాణిక్యం నాయుడు, పశు సంవర్ధకశాఖ జెడి వై.వి రమణ, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, డిఎంహెచ్ఒ జీవనరాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శివరాత్రికి పటిష్ట బందోబస్తు

రామతీర్థంలో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి వకుల్ జిందాల్

రామతీర్థం ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం శ్రీరామస్వామి దేవాలయానికి శివరాత్రిని పురస్కరించుకుని ఫిబ్రవరి 26న పెద్ద ఎత్తున భక్తులు వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. రామతీర్థంలో పోలీసుశాఖ ఏర్పాటు చేస్తున్న బందోబస్తు, భద్రత ఏర్పాట్లును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రికి రామతీర్థం సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. విజయనగరం నుంచి రామతీర్థం వచ్చే ప్రత్యేక ఆర్‌టిసి బస్సులను కళ్యాణం గ్రౌండు వద్ద, రణస్థలం నుండి రామతీర్థం వచ్చే ప్రత్యేక బస్సులను ఎంపిపి స్కూలు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సీతారామస్వామి ఆలయం, శివాలయం, కోనేరు-బాత్ ఘాట్స్, కేశ ఖండనశాల, నీలాద్రి కొండపైన, ట్రాఫిక్ రెగ్యులేషను, వాహనాల పార్కింగు, మూవింగు పార్టీలుగా బందోబస్తును విభజించామన్నారు. రామతీర్థం నీలాద్రి కొండపైన ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ రెగ్యులేషను, గొలుసు, జేబుదొంగతనాలు, ఈవ్ టీజింగు జరగకుండా చూడాలన్నారు. నేరాలను నియంత్రించేందుకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, వాటిని నిరంతరం పరిశీలిస్తూ, బందోబస్తును పర్యవేక్షించాలన్నారు. బందోబస్తు నిమిత్తం 5గురు సిఐలు, 22మంది ఎస్ఐలు, 54మంది ఎఎస్ఐలు/ హెచ్‌సిలు, 94మంది కానిస్టేబుళ్ళు, 20మంది మహిళా కానిస్టేబుళ్ళు, 6గురు హోంగార్డులు ఎస్టీఎఫ్ సిబ్బందిని, మూడు రోప్ పార్టీలను నియమించామని వివరించారు. ఆయన వెంట డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, నెల్లిమర్ల ఎస్ఐ గణేష్, దేవస్థానం ఇఒ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల దిగుబడి పెంచేందుకు

2 ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లష్టర్లు

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

పంటల దిగుబడి పెంచడం, నాణ్యమైన పంటల ఉత్పత్తి, ఉత్పాదకత, సేంద్రీయ సాగును ప్రోత్సహించడం, మార్కెట్ సౌకర్యాలను కల్పించడం, రుణసాయం అందించి ప్రోత్సహించడం కోసం జిల్లాలో రెండు ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లష్టర్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ క్లష్టర్ల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తమ ఛాంబర్‌లో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దత్తిరాజేరు మండలంలోని పోరలి, సరేవలస, టి.బూర్జవలస, గడసాం గ్రామాలను ఒక క్లష్టర్‌గా, రామభద్రాపురం గ్రామాన్ని ఒక క్లష్టర్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. దత్తిరాజేరు క్లష్టర్లో 283 రైతు కుటుంబాలు, రామభద్రాపురం క్లష్టర్‌లో 290 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. మూడేళ్లపాటు అమలయ్యే ఈ కార్యక్రమంలో భాగంగా, ఎంపిక చేసిన గ్రామాల్లో సుమారు రూ.40 లక్షల వ్యయంతో రైతులకు మౌలి సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాలు, రుణ సహాయాన్ని అందించేందుకు వ్యవసాయ, అనుబంధ శాఖల వారీగా సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా రైతులు, ఉద్యాన రైతులు, మత్స్యకారులు, పశు పెంపకం దార్లతో సమావేశాలను నిర్వహించి, వారి అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. గ్రామాల్లో వీరికి శిక్షణ కేంద్రాలను, ఎఫ్‌పిఒల ద్వారా కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

డ్వాక్రా ఉత్పత్తుల విక్రయాల కోసం రోడ్డుపక్కన స్టాళ్లు

స్వయం శక్తి సంఘాల ఉత్పత్తులను విక్రయించేందుకు ఎస్‌హెచ్‌జిలతో రోడ్డు పక్కన కంటైనర్ల ద్వారా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో 20 కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కేంద్రాల్లో సుమారు 1200 రకాల మహిళా సంఘాల ఉత్పత్తులతోపాటు టీ, కాఫీ లాంటి పానీయాలను కూడా విక్రయించాలని సూచించారు. జాతీయ రహదారులు, పర్యాటక ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా మంచి విక్రయాలు జరిగే అవకాశం ఉందని, రెండు రోజుల్లో ఈ ప్రదేశాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ఆర్ అండ్‌బి ఎస్‌ఈ కాంతిమతి, జాతీయ రహదారులు, వ్యవసాశాఖ, మత్స్యశాఖ, డిఆర్డిఎ అధికారులు పాల్గొన్నారు.

పశువ్యాధి నియంత్రణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, జెడి రమణ

1 నుంచి పశువ్యాధి నియంత్రణ కార్యక్రమం

ప్రజాశక్తి-విజయనగరం

మార్చి ఒకటో తేది నుంచి 30 వరకు జిల్లాలో పశువ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం తమ ఛాంబర్లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవి రమణ మాట్లాడుతూ గాలికుంటువ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించి, వ్యాధుల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, ఉద్యాన శాఖ డిడి జమదగ్ని, వ్యవసాయశాఖ ఎడి అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఇద్దరికి జైలుశిక్ష

ప్రజాశక్తి-గంట్యాడ

ఇద్దరికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్టు తీర్పునిచ్చింది. 2018 సంవత్సరంలో గంట్యాడ మండలంలో లక్కిడాం గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్తున్న మహిళను అడ్డగించి మెడలో రెండున్నర తులాల పుస్తెలతాడును దొంగిలించిన కేసులో, జగ్గాపురంలోని రాత్రి ఇంట్లో ప్రవేశించి పుస్తెలతాడు దొంగిలించిన కేసులో గుమ్మడి సురేష్, కోమటిపల్లి శ్రీను అరెస్టయ్యారు. వీరికి విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ బుజ్జి.. ఆరు నెలలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు.

ఈ కేసులను అప్పటి గంట్యాడ ఎస్ఐ నారాయణరావు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈ కేసుల్లో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంతి గౌతమి వాదించారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న బొద్దాం గ్రామస్తులు

పరిహారం కోసం బాధితుల వినతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాంలో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులు పరిహారం చెల్లించాలని తహశీల్దార్ రాములమ్మను కోరారు. సోమవారం బొద్దాం గ్రామానికి చెందిన సుమారు 30 మంది బాధితులు.. తహశీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతి అందజేశారు. నష్టపరిహార జాబితాలో తమ పేర్లు లేవని, పరిహారంలోనూ వ్యత్యాసాలు ఉన్నాయని విన్నవించారు. విచారణ చేపట్టి, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, బాధితులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ రాములమ్మ హామీనిచ్చారు. విచారణ సమయంలో ప్రతిఒక్కరూ అందుబాటులో ఉండాలని కోరారు.

సదస్సులో పాల్గొన్న విసి రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్లు

జెఎన్‌టియులో సాంకేతిక సదస్సు

ప్రజాశకి-విజయనగరం టౌన్

జె ఎన్ టి యు ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సాంకేతికోత్సవం ఘనంగా సోమవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఆర్ఎస్ఎంఐకి చెందిన శ్రీనివాస్ ముప్పాలా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ జి. జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు పాల్గొన్నారు. జెఎన్‌టియుకె టిఎ 2కె 25లో విద్యార్థులకు ఉపయోగపడే అనేక ప్రాముఖ్యతలను వివరించారు. శ్రీనివాస్ ముప్పాలా మాట్లాడుతూ విద్యార్థులకు నిరంతర అభ్యాసం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ఎంత అవసరమో వివరించారు. కొత్త సాంకేతికతలను అనుసరిస్తూ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటుచేశారు. ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు ఎఫ్‌పిఒ ఎపిఎం వెంకటరమణ తెలిపారు. మండలంలో గనిశెట్టిపాలెం, చీడివలస, గొల్లలపాలెం, గ్రామాల్లో రైతు సంఘాల సభ్యులు ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు విక్రయిస్తున్నట్లు చెప్పారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే అధికారులకు, ఉద్యోగులకు, ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు శ్యామల, లక్ష్మి, రాజేశ్వరి, రామలక్ష్మి, వాసులక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భోగేశ్వర రావు-ఝాన్సీ రాణి మెమోరియల్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలను స్థానిక రింగ్‌రోడ్‌లో ఉన్న ఫైర్ చెస్ స్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ సిఇఒ కెవి జ్వాలా ముఖి ఈ పోటీలను పర్యవేక్షించారు. ఐదు జిల్లాల నుంచి దాదాపుగా 150 మంది పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా జె.నాగరాజు, బి.శ్రావ్యశ్రీ, బి.సాకేత్ నిలిచారు. వీరికి నగదు బహుమతి అందజేశారు.



ఎంపిడిఒకు వినతినిస్తున్న సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ గురుకులానికి డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణకు వినతి అందించారు. గురుకులంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినులు పేద కుటుంబాలకు చెందిన వారని ఆయన తెలిపారు. వీరంతా ఇంటర్ పూర్తిచేశాక డిగ్రీ విద్య కోసం సరైన అవకాశాలు లేక, చదువు మధ్యలో ఆపేస్తున్నారని వివరించారు. గురుకులంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అనుగుణంగా సౌకర్యాలు ఉన్నాయని, దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపిడిఒ తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చిన్నిపాలెం గ్రామస్తులు

భూములకు హక్కు కల్పించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కలెక్టర్‌ను చిన్నిపాలెం రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు టి.అప్పారావు మాట్లాడుతూ కొత్తవలస మండలం చిన్నిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సాగుచేస్తున్న 12 గ్రామాల రైతులకు న్యాయం చేయాలని కోరారు. సుమారు 150 సం? పైగా సాగు చేసు, భూమి మీద ఉన్న రైతు భూ ములకు. రైతుల పేర్ల మీద సాగు దారునిగా:అనుభవం కల్పించాలన్నారు. రైతులకు హక్కు కల్పించి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ధర్నాకు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మద్దతు తెలిపారు.

భౌగోళిక పాలసీ పైలట్ జిల్లాగా విజయనగరం

- పలు ఐఐటి సంస్థలు, కంపెనీల ప్రతినిధులతో వర్క్ షాప్
- సాంకేతికతతో పలు సమస్యలకు పరిష్కారం : జెసి

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ భౌగోళిక పాలసీ 2022 లో పైలట్ జిల్లాగా విజయనగరాన్ని ఎంపిక చేయడం వలన స్థానికంగా ఉన్న అనేక అంశాల కు చక్కటి పరిష్కారం లభిస్తుందని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పలుశాఖల వద్ద ఉన్న డేటా తో ఆయా శాఖల్లోని అంశాలకు సంబంధించి వచ్చే రెండు, మూడు నెలల్లో మంచి ఫలితాలను చూడబోతున్నామని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆపరేషన్ ద్రోనగిరి పేరుతో జియో స్పేషియల్ డేటా ప్రమోషన్ అండ్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. దేశంలో 5 రాష్ట్రాల్లో గల 5 జిల్లాల్లో ఈ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేయగా అందులో విజయనగరం ఒకటని జెసి తెలిపారు. జియోస్పేషియల్ డేటా ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీకాంత్ శాస్త్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అమలు రోడ్‌మ్యాప్‌ను రూపొందిం చేందుకు కీలక వాటాదారులను ఒకచోట చేర్చారని తెలిపారు. రవు. ఆపరేషన్ ద్రోణగిరిలో ఇంజినీరింగ్ విద్యార్థులను కూడా భాగస్వామ్యులను చేయాలని కోరారు. దీని లక్ష్యం నిజ-సమయ వ్యవసాయ పర్యవేక్షణ, సలహా సేవల ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం, కృత్రిమ మేధా శక్తితో కూడిన మార్గం ఆప్టిమైజేషన్, ఫ్లీట్ ట్రాకింగ్‌ను ఉపయోగించి రవాణామౌలిక సదుపాయా లను మెరుగు, పట్టణ ప్రణాళిక, గ్రామీణాభి వృద్ధికి పరిష్కారాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. డైరెక్టర్, ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ కె ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ నోడల్ జియోస్పేషియల్ ఇన్నోవేషన్ యాక్సిలరేటర్ (జిఐఎ)గా ఐఐటి తిరుపతి కీలక పాత్ర వహిస్తోందన్నారు. జిల్లా వ్యవసయాధికారి తారక రామారావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించే టప్పుడు రైతులకు ఖచ్చితమైన సమాచారం లేకపోవడం వలన నష్టపోతున్నారని, ఖచ్చితమైన సమాచారాన్ని, వాస్తవ సమయం లో ఇచ్చినట్లు చూడాలని కోరారు. మున్సిపల్ కమీషనర్ నల్లనయ్య మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌లో రహదారులు కనపడడం లేదని తెలిపారు. సమావేశం అనంతరం బృందం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కలసి వర్క్‌షాప్‌లో చర్చించిన అంశాలను వివరించారు. సమావేశం అనంతరం బంద సభ్యులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లారు. సమావేశంలో ఆర్‌టిజిఎస్ డైరెక్టర్ సంజయ్ సిన్హా, తిరుపతి ఐఐటి సిఇఒ మేజర్ జనరల్ ఎం. రాజేంద్రన్, డైరెక్టర్ ఆఫ్ జియో స్పేస్ ప్రొఫెసర్ అభిజిత్, , పలు కంపెనీల సిఇఒలు, జలవనరులు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసుశాఖకు వెన్నెముక.. ఎఆర్

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు శాఖకు ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం వెన్నెముక వంటిదని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు 14 రోజులపాటు నిర్వహించిన పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమంలో భాగంగా పోలీసు పరేడ్ గ్రౌండులో నిర్వహించిన పరేడ్‌కు ఎస్‌పి హాజరై, వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరి దృష్టి పోలీసు శాఖపై ఉంటుందన్నారు. ప్రజలు నిత్యం పోలీసుల తీరును గమనిస్తుంటారని, అందరికీ మార్గదర్శకంగా నిలిచే విధంగా ప్రవర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ ముఖ్యమని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చెప్పారు. డీ మెబిలైజేషను ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పరేడ్‌కు ఆర్ఐ (అడ్మిన్) ఎన్.గోపాలనాయుడు కమాండరుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, ఎం.వీరకుమార్, ఆర్ఎస్ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, సూరినాయుడు, ఆర్ఎస్ఐలు బి.సూర్యనారాయణ, ఎ.రామకృష్ణ, కె.వరప్రసాద్, టి.రామారావు, ఎన్.వి.ఆర్. పాత్రుడు, సిహెచ్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చనమల్లపేట రైతు చనమల్ల అబద్ధం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్యాం చేసుకున్న ఘటనపై ఆర్‌డిఒ దాట్ల కీర్తి సోమవారం గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణలో రైతు అబద్ధం భూములు సాగు చేస్తున్నారని గర్తించి వాటికి ఎటువంటి రిజిస్ట్రర్ డాక్యుమెంట్ లేవని గుర్తించినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. కాగా ఆర్‌డిఒ రైతు సాగు చేస్తున్న భూములన్ని పూర్తి విచారణ జరపాలని మండలం సర్వేయర్, తహశీల్దారు, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసి నివేదికను పంపించాలని తెలిపారు. గ్రామ పెద్దలు, రైతులను విచారణ చేశామని ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తహశీల్దార్ సుదర్శనరావు తెలిపారు. ఈ విచారణలో మండల సర్వేయరు దివ్య, ఆర్ఐ వేణు గోపాలరావు, గ్రామ సర్వేయరు శ్రీరామ్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతుకు న్యాయం చేయాలి

ఆత్మహత్యాయత్నం చేసిన రైతుకు ప్రభుత్వం న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. భూమి ఆన్‌లైన్ చేయాలని కోరుతూ ఆత్మహత్యాయత్నం చేసిన చనమల్లపేటకు చెందిన రైతు చనమల్ల అబద్ధం కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ భూమి ఆన్‌లైన్ చేయాలని కోరుతూ ఆత్మహతాయత్నం చేసిన రైతుకు ప్రభుత్వం ఆన్‌లైన్ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 20ఏళ్లుగా సాగులో ఉన్న భూమిని ఆన్‌లైన్ చేయాలని రైతు కోరుతున్నా రెవెన్యూ అధికార్లు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రైతు అబద్ధం భూమి ఆన్ లైన్ కోసం విఆర్ఒని సంప్రదించగా మీ పేరున ఉన్న 60 సెంట్లు ఆన్‌లైన్ చేస్తానని దానికి డబ్బులు కూడా తీసుకున్నాడని రైతు చెప్పినట్లు రామారావు వెల్లడించారు. రియల్ ఎస్టేట్ కారణంగా భూములు ధరలు పెరిగి రెవెన్యూ యంత్రాంగం ఆన్‌లైన్ విషయంలో పేద రైతులకు సహకరించకుండా రియల్ ఎస్టేట్ యజమానులకు సహకరిస్తున్నారని తెలిపారు. రైతు చనమల్ల అబద్ధం 20ఏళ్లుగా సాగులో ఉన్నారు కాబట్టి రెవెన్యూ అధికార్లు భూములు సర్వే జరిపి న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుని పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు కనకల పద్మనాభం ఉన్నారు.

విచారణ చేపడుతున్న ఆర్‌డిఒ కీర్తి

చిన్నారి, తల్లితో వైద్యులు

చిన్నారిని కాపాడిన డాక్టర్ సుధీర్

ఊపిరితిత్తుల నుండి చెట్టు కొమ్మను తొలగించిన వైద్య బృందం

ప్రాణాపాయం తప్పిన శిశువు

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరానికి చెందిన ప్రముఖ పల్మనాలజిస్ట్ (మూత్రపిండాల, మూత్రనాళలు) వైద్యులు డాక్టర్ టి.సుధీర్, వైద్య బృందం అత్యవసర చికిత్స చేసి ఆరు నెలల చిన్నారిని కాపాడారు. ఒడిశాకు చెందిన 6 నెలల శిశువు, తక్కువ రక్త ఆక్సిజన్ స్థాయిలు (60శాతం), చిరాకుతో, విషమ స్థితిలో మెడికవర్ హాస్పిటల్స్ (ఎంవిపి కాలనీ, వెంకోజీపాలెం, విశాఖపట్నం) అత్యవసర విభాగానికి వెళ్లింది. ఆ రోజు ఉదయం పాప చింతపండు గింజను పీల్చిందని తల్లి తెలిపింది. డాక్టర్ హేమంత్, డాక్టర్. లక్ష్మణ్ నేతృత్వంలోని ఎమర్జెన్సీ బృందం వెంటనే శిశువును బ్రాంకోస్కోపీ సూట్‌కు తరలించారు. ఒక ఆశ్చర్యకరమైన మలుపులో, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తలే అత్యవసర బ్రాంకోస్కోపీ నిర్వహించి, శిశువు ఊపిరితిత్తులలో ఒక చెట్టు కొమ్మ చిక్కుకున్నట్లు కనుగొన్నారు. దీని వలన వాయుమార్గం పూర్తిగా అడ్డంకిగా మారింది. వైద్యులు 10 నిమిషాల్లోనే బ్రాంకోస్కోపీ బాస్కెట్‌ని ఉపయోగించి ఆ కొమ్మను విజయవంతంగా తొలగించారు. ఫలితంగా శిశువు చురుకుగా మారింది, ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడ్డాయి మరుసటి రోజే ఆ చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. చిన్నారి ప్రాణాలను కాపాడిన మెడికవర్ హాస్పిటల్ వైద్యులను బాలిక తల్లిదండ్రులు, తోటి వైద్యులు అభినందించారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను గుర్తించాలి

సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు డి.మాధవీలత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులలో దాగివున్న సాంకేతిక సామర్ద్యాలను గుర్తించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష రాష్ట్ర సెక్టోరియల్ అధికారి డి.మాధవీలత అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో మోడల్ స్కూల్స్, గురుకులాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ప్రిన్సిపాళ్లతో తెలుగు, ఇంగ్లిష్, లెక్కలు ఉపాధ్యాయులకు పర్సనలైజ్ అడాప్టవ్ లెర్నింగ్ లాబ్స్ అనే అంశంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష , జిల్లా అదనపు సమన్వయ కర్త ఎ.రామారావు మాట్లాడారు. నేటి విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంకేతిక అంశాలను నేర్చుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో 10, ఇంటర్ పరీక్షలలో రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఎపిఒ వి.గోపీచంద్, ఎఎస్ఒలు ఎస్. సూర్యారావు, సిహెచ్. జగన్మోహన్, ఎపిఒ విశ్వేశ్వర రావు, పార్వతీపురం మన్యం జిల్లా ఎఎస్ఒ వి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దుపై పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంత్రి మండల సమావేశంలో అవుట్ సోర్సింగ్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దు చేస్తామని చేసిన నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, నెల్లిమర్ల నగర పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నెల్లిమర్ల పట్టణంలో ముఖ్యమంత్రికి పోస్ట్‌కార్డు ద్వారా కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో లేఖలు రాసి పోస్ట్ బాక్స్‌లో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బాబురావు, అధ్యక్షులు శ్రీను, కోశాధికారి హరి మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్తారని, అప్పుడు జీతాలు పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్ ఇవ్వడని పిఎఫ్, ఇఎస్ఐ కూడా గ్యారెంటీ ఉండదని ఆప్కాస్ రాకపూర్వం ఇదే జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాలలో కార్మిక సమస్యలపై చర్చించాలని లేకపోతే భవిష్యత్తులో ఆందోళన సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కమిటీ నాయకులు రాము, బాల, వెంకట్, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణలత

సమర్థవంతంగా ఎల్లారమ్మ జాతర

ప్రజాశక్తి - జామి

జామి ఎల్లారమ్మ జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తహశీల్దార్ కృష్ణలత ఆదేశించారు. మార్చి 6, 7, 8 తేదీల్లో జరిగే ఎల్లారమ్మ జాతర నిర్వహణపై సోమవారం తన కార్యాలయంలో పోలీస్, ఫైర్, ఆర్‌టిసి, పంచాయతీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతరకు లక్షలాది జనం రానున్న తరుణంలో పారిశుధ్యం, తాగునీరు సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించారు. 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వీరజనార్ధన్ తెలిపారు. కార్యక్రమంలో ఇఒ రమణారావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త వేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాలువల్లో చెత్తా చెదారాలు వేయరాదని, డస్ట్ బిన్లను తప్పనిసరిగా వినియోగించుకోవాలని ప్రజలకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం 17వ డివిజన్ పరిధిలో ఉన్న ప్రధాన కాలువను ప్రజారోగ్య సిబ్బంది ప్రక్షాళన చేపట్టారు. ప్రధానంగా వ్యాపార కూడలికి ఆనుకుని ఉన్న కాలువ కావడంతో చెత్తాచెదారాలు ఎక్కువగా చేరుతున్నాయి. ప్రతిసారి పూడిక తొలగిం చేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కమిషనర్ పల్లి నల్లనయ్య వ్యాపారులకు పలు సూచనలు చేశారు. రహదారులను, కాలువలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదని స్పష్టంచేశారు.

15 రోజులకోసారి వాటర్ ట్యాంకుల శుభ్రం

15 రోజులకు ఒకసారి తప్పని సరిగా వాటర్ ట్యాంకులు పరిశుభ్రపరిచేలా సిబ్బందికి ఆదేశించామని కమిషనర్ తెలిపారు. ట్యాంకులను శుభ్రపరచడం ద్వారా సురక్షితమైన నీటిని ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ప్రజలు నీటి వృథాను అరికట్టాలని కోరారు.

సిటియులో జాతీయ సెమినార్

ప్రజాశకి-విజయనగరం టౌన్

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో సోమవారం 'మిల్లెట్స్ క్వెస్ట్ 2025 - బిల్డింగ్ రెసిలెన్స్, ఫీడింగ్ ది వరల్డ్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభమైంది. మిల్లెట్ల వినియోగం, సంరక్షణ యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకతను వెలుగులోకి తీసుకురావడం ఈ సెమినార్ లక్ష్యమని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం చిరు ధాన్యాల ద్వారా మనకు అందుతుందని, దీనిని ప్రతి వొక్కరూ తెలుసుకొని వినిమయం లోకి తెస్తే అందరూ తమ ఆరోగ్యాన్ని పెంపొందించు కోవాడమే కాకుండా అవి పండించే రైతులకు కూడా ప్రోత్సహించినట్లు అవుతుందని సిటియు విసి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లుగా ప్రముఖ పర్యావరణవేత్త ప్రకృతివనం ప్రసాద్, మిల్లెట్స్ రాయబారి లహరి బాయి పాల్గొన్నారు. మిల్లెట్‌ను సూపర్‌ఫుడ్‌గా ఎలా ఉపయోగించవచ్చో, ఆరోగ్యకరమైన జీవన విధాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో వివరించారు.

వెంకయ్యపాలెంలో తాగునీటికి ఇబ్బందులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి పంచాయతీ పరిధిలోని వెంకయ్యపాలెంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణను కలిసి వినతి అందించారు. బోరు నీరు తాగడానికి ఉపయోగ పడటం లేదని వాపోయారు. గతంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, జలజీవన్ మిషన్‌లో నిధులు వస్తే గ్రామానికి కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. మూడు నెలలు కావస్తున్నా కుళాయిలు ఏర్పాటు చేయాలని వారు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఎంపిడిఒ స్పందిస్తూ కుళాయిలు ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. వినతి అందించినట్లు వారిలో గ్రామస్తులు ఎన్.శ్రీను, గుమ్మడి దేవుడుబాబు, తదితరులున్నారు.

కొనసాగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ ఐదోరోజు సోమవారం కొనసాగింది. ఈ శిక్షణను ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు సందర్శించారు. అంగన్వాడీలు తయారు చేసిన టిఎల్ఎంను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో ముస్లిములకు విశాఖపట్నానికి చెందిన మోసెస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన సోమవారం నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు.

ఒమ్మిలో సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని ఒమ్మి గ్రామంలో రెండు సీసీ కెమెరాలు సోమవారం అంబళ్ల రమణ, అంబళ్ల అరుణ్ సహాయంతో ఏర్పాటు చేశామని ఎస్ఐ బి. గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి కెమెరాలు పట్టణాల్లోనే కాక గ్రామాల్లో కూడా ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నేరాలు నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర చాలా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామంలో పెద్దలు ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం దాతలను అభినందించారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-రాజాం

రాజాం నగర పంచాయతీ పరిధిలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తున్న జక్కం విశ్వంబరేశ్వర్ రావును అదుపు లోకి తీసుకొని 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ సిహెచ్ రాజశ్రీ, హెచ్‌సి సుదర్శన్‌కుమార్, కె.రాంబాబు, కానిస్టేబుల్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఖాళీ స్థలాల్లో చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని రాణి మల్లమ్మదేవి పార్కు, ఆస్పత్రి రోడ్డులో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళిని ఆదేశించారు. చెరువులో ఉన్న వ్యర్థాలను తొలగించాలని సూచించారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఆమెతో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి